# నేను నేనే-22

## Index | Page no


| Index | Page no |
|---|---|
| 266. ఎంత గొప్ప conclusion కు వచ్చినా...చివర్లో  దానిని కూడా వదిలేయండి, ఎందుకంటే conclusion కు వచ్చినవాడే సత్యం కాబట్టి... | 2 |
| 267. లేకుండా పోయేది ఉన్నా లేనట్టే | 13 |
| 268. విశ్వం మొత్తం ఎంత తూకమో, పరమాణువు కూడా అంతే తూకము | 20 |
| 269. నీ దృష్టిని బట్టే సృష్టి | 21 |
| 270. జ్ఞాన జ్యోతి | 27 |
| 271. ఏకం సత్ | 28 |
| 272. అంతిమ మార్గం | 32 |
| 273. ఎయ్ తిత్తి....! స్వానుభవం | 38 |

## 266. ఎంత గొప్ప conclusion కు వచ్చినా...చివర్లో  దానిని కూడా వదిలేయండి, ఎందుకంటే conclusion కు వచ్చినవాడే సత్యం కాబట్టి...

మా గురువుగారు ఒకమాట అనేవారు-

"వీడు నాకు వద్దు" అని భూమి అనుకుంటే

వాడికి ఆ భూమిని అమ్మేయాలనే బుద్ధి కలుగుతుందట...

"వీడు నాకు కావాలి" అని భూమి అనుకుంటే

వాడికి ఆ భూమిని కొనాలనే బుద్ధి కలుగుతుందట.

ప్రతి వస్తువుకూ జ్ఞానం ఉంటుంది.

దాని మనం గుర్తించక జడం అంటాం.

* * *

శర్మ గారికి గురువు గారికి మధ్య సంభాషణ:

సద్గురు:

గాఢనిద్రలో "నేనుండడం" ఉంటుందేగాని

వ్యక్తిగా ఉండడం అనేది ఉండదు.

ఆ గాఢనిద్రలో కలిగే చిన్నపాటి కదలికనే

మెలకువ అంటున్నాం.

నిజానికి ఇది మెలకువ కాదు.

ఇదొక (పెద్ద)కల.

గాఢనిద్రనే మెలకువ అనాలి.

శర్మ:

కానీ గాఢనిద్ర అనేది తమస్సు కదా?

సద్గురు:

నిద్ర గురించి నిద్రలోనే మాట్లాడుకోవాలి.

మెలకువలో మాట్లాడితే ఎలా?

బెంగుళూరు గురించి బెంగుళూరులోనే మాట్లాడుకోవాలి.

కాళహస్తిలో మాట్లాడితే ఎలా?

కాళహస్తిలో ఉండి బెంగళూరు గురించి మాట్లాడినా

అది కాళహస్తి గురించి మాట్లాడ్డమే అవుతుంది.

* * *

సద్గురు:

గాఢనిద్రలో ఉన్న ఆ నేను

మూడుగా డివైడ్ అవుతుంది.

ఆ డివైడ్ అవటాన్నే మనం 'మెలకువ' అంటున్నాం.

ఆ మూడే-

1.వ్యక్తి

2.ప్రపంచము

3.పై రెంటికీ కారణమైన శక్తి(దైవము)

వ్యక్తి ప్రపంచంతో, దైవంతో ఎంజాయ్ చేస్తాడు.

మళ్లీ గాఢనిద్రలో మూడూ ఏకం అవుతాయి.

మూడూ ఒకటిగా ఉంటే - నిద్ర.

ఒకటి మూడుగా అయితే - మెలకువ.

శ్రీమతి శర్మ:

మళ్లీ నిద్రలో కల వస్తోంది కదా!

సద్గురు:

ఈ మెలకువ అనేది కూడా కలే.

మెలకువ అనేది పెద్ద కల.

కల అనేది చిన్న కల.

ఈ కలకు ఆ కల శాంపిల్.

అలాగే...

గాఢనిద్ర-సమాధి రెండూ ఒకటే.

సమాధిస్థితికి శాంపిల్ గాఢనిద్ర.

* * *

శర్మ:

"గాఢనిద్ర ఒక్కటే నిజమైన మెలకువ"

సద్గురు:

అవును...

అది ఎవరి మెలకువా కాదు...

దేని మెలకువా కాదు.

అది "స్వయం".

* * *

సద్గురు:

1. నేను శర్మ అనేది శర్మ కాదు "నేను".

2. శర్మను నేను అనేది శర్మయే.

మొదటి స్టేట్ మెంటు "నేను"ది.

రెండవ స్టేట్ మెంటు "శర్మ"ది.

మొదటి నేను అహంస్వరూపం.

రెండవ నేను అహంకారం.

నేనుగా "ఉంటుంది" అహంస్వరూపం.

నేను అని "అంటుంది" అహంకారం.

* * *

శర్మ:

ఉండేది త్రాడొక్కటే.

పాము లేనేలేదు...

ఉండేది దైవమొక్కటే

అన్నీ దాంట్లోనుంచే వచ్చాయి...

సద్గురు: 'దాంట్లో నుంచి రావడం' కాదు...

స్వయంగా అదే.

"అదే" సకలంగా ఉంది.

శర్మ మేలుకొని ఉంటే ఉంటాడు.

మెలకువలో లేకపోతే ఉండడు.

కానీ "నేను" అనేది-

శర్మ మేలుకున్నా ఉంటుంది.

మేలుకోకపోయినా ఉంటుంది.

శర్మ:

ప్రశ్నలన్నీ అహంకారానికే...

అహంస్వరూపానికి కాదు.

సద్గురు:

దానికి ఆ అవసరం లేదు...

శర్మ:

కనబడేది - ఉపాధి.

కనబడనది - తత్త్వం.

సద్గురు:

కనబడేది, కనబడనిది రెండూ

"నేను"లోనే ఉండేది.

శర్మ:

త్రాడే ఉంది...పాము లేనేలేదు...

సద్గురు:

ఉండేది ఒకదానికే ఉనికి.

ఆ ఉనికి త్రాడుగానైనా ఉంటుంది.

పాముగానైనా ఉంటుంది.

తెలియకుంటే పాము అంటాం.

తెలిస్తే త్రాడు అంటాం.

తెలియకుంటే ప్రపంచం అంటాం.

తెలిస్తే ఆత్మ అంటాం.

* * *

నేను తండ్రి

నేను తల్లి

నేను కుమారుడను

నేను కుమార్తెను

అని వారి చేత వ్రాయించి...

ఆ నాలుగు నేనులు వఱకే ఎడంగా తీసి చూస్తే

ఏ నేను తండ్రిది? ఏ నేను తల్లిది? అని చెప్పలేం.

నేను పురుషుడను.

నేను స్త్రీని

అని వారి చేత వ్రాయించి...

ఆ రెండు నేనులు వఱకే ఎడంగా తీసి చూస్తే

ఏ నేను పురుషునిది? ఏ నేను స్త్రీది?

అని చెప్పలేం.

* * *

శరీరంలో ఏ భాగాన్ని చూపించినా

దానికో స్థానం, దానికో పేరు, దానికో క్రియ ఉంది.

కానీ ఈ నేను-నేను అనేదానికి ప్రత్యేక స్థానం లేదు...

ప్రపంచంలోని ఈ స్థానాలకు, ఈ నామాలకు, ఈ రూపాలకు సంబంధం లేకుండా ఉంది "అది".

* * *

శర్మ:

యద్దృశ్యం తన్నశ్యం...

కనబడే దృశ్యమంతా నశించేదే...

సద్గురు:

అసలు లేనేలేదు... అని అర్థం.

నాశనం అవుతుంది అనికాదు.

* * *

ఆత్మానుభవం అనేది-

అనుభవించేవాడు ఉండి,

అనుభవించే అనుభవం కాదు అది.

స్వయంగా అనుభవం అది.

అనుభవించేవాడు-అనుభవింపబడేది-అనుభవం

అనే త్రిపుటి లేని "అనుభవం" అది.

* * *

శర్మ:

విత్తుముందా? చెట్టుముందా?

సద్గురు:

నీవు ముందుగా దేన్ని చూస్తావో అదే ముందు.

ఈ రెంటినీ చూసే నీవే నిజం.

మిగతా అంతా అబద్ధం.

అనగా తత్కాలిక సత్యం.

* * *

సద్గురు: ఎంత గొప్ప conclusion కు వచ్చినా...

చివర్లో "ఇది కాదు" అనుకుని లేచి వెళ్లిపోండి...

శర్మ: విచారణ చేసి ఓ conclusion కు వచ్చాము కదా! అదే పరమసత్యం కదా! మళ్లీ "ఇది కాదు" అని యెందుకనుకోవడం?

సద్గురు:

conclusion కు వచ్చినవాడే సత్యం కాబట్టి.

చెత్తను ఊడ్చేస్తే, శుభ్రత అక్కడే ఉన్నట్టు.

subject ను ఇదికాదు అని తుడిపేస్తే...

నీవే subject గా ఉంటావు.

నీకు subject కాదు.

నీవే subject.

* * *

శర్మ:

"నేను" పైనే దృష్టిని కేంద్రీకరించాలి...

సద్గురు:

నీవే "అది".

మళ్లీ దృష్టిని కేంద్రీకరించడం ఎందుకు?

నిజానికి అన్నిటిపైనా దృష్టి పెట్టి ఉంది "నేను".

* * *

శర్మ:

ఊరకే ఉండాలన్న మాట...

సద్గురు:

అది కూడా అనకూడదు...

* * *

## 267. లేకుండా పోయేది ఉన్నా లేనట్టే

గురువుగారు ఒకరి వైపు చూసి ఇలా అన్నారు-

మనం వ్యవహరించే సత్యాసత్యములు రెండూ సాపేక్షకములే...అసత్యములే.

ఒకటి విడిచి మరొకటి మనజాలవు.

సత్యమనేది మారురూపంలో ఉన్న అసత్యం.

అసత్యమనేది మారురూపంలో ఉన్న సత్యం.

బొమ్మ-బొరుసు రెండూ ఉంటేనే ఆ నాణెం చెల్లుతుంది.

సత్యాసత్యాలు రెండూ ఉంటేనే వ్యవహారం జరిగేది.

సత్యాసత్యాలు రెండూ అసత్యమే అని తెలిసినా సరే

వ్యవహారం ఉండాలంటే రెండూ అవసరమే.

అసలు సత్యానికి వ్యతిరేకపదం ఉండదు.

అసలు సత్యం ప్రకటనం కాదు.

ప్రకటనం అయ్యేది సత్యం కాదు.

ప్రకటించకుండా ఉంటే సత్యమే.

ప్రకటిస్తే అసత్యం అయిపోతుంది.

* * *

'ముమ్మాటికి నిజం' అంటుంటారు...

నిజం నిజంగా నిజమే అయితే ముమ్మారు (మూడు సార్లు) చెప్పవలసిన అవసరం ఏముంది?

'ముమ్మాటికి నిజం' అనే మాట అబద్ధం.

'ముమ్మాటికి నిజం' అని ఎవడన్నా అన్నాడంటే వాడు చెప్పింది అబద్ధం అనే.

* * *

"లేకుండపోయేది ఉన్నా లేనట్టే."

కలలో ఓ ఇద్దరు కూర్చొని చర్చ జరిపారు...

కల నిజమా? అబద్దమా? అని.

మనం సత్సంగంలో కూర్చుని సత్యాసత్యవిచారణ చేయడం కూడా అలాంటిదే.

అన్నారు గురువుగారు...

"మరి కలలో 'ఇది ఒక కల' అన్నవాడి వాదన నిజమే కదా! అన్నాడు బాబు.

అక్కడవఅకే నిజం.

కలయావత్తు అబద్ధం కదా!

"లేకుండా పోయేది ఉన్నా లేనట్టే."

కలలోని జ్ఞాని, అజ్ఞాని ఇద్దరూ అజ్ఞానులే (లేనివారే)

అన్నారు గురువుగారు.

మరి సత్యమేది? అడిగాడు బాబు...

సత్యాసత్య విచారణ జరిపే నీవే సత్యం.

అని ఠక్కున చెప్పారు గురువుగారు.

ఒకతను గురు ఉవాచను ఉదహరించాడు-

"నేను" ఎవరూ కాదు, నేను ఏదీ కాదు"

గురువుగారు నవ్వుతూ-

అని ఎవరికి చెబుతున్నావు...?

ఉండేది నీవొక్కడే అయినప్పుడు...? అన్నారు.

* * *

సాక్షికి సబ్జక్టు ఉంటుంది.

కేవలసాక్షికి సబ్జక్టు ఉండదు.

యెందుకంటే అన్యము లేక.

subject లేని సాక్షి కేవలసాక్షి.

* * *

రాముడు దేవుడు అంటాం...

రావణుడు రాక్షసుడు అంటాం...

ఈ రెండు పాత్రలను రచించిన వాల్మీకి, దేవుడా?రాక్షసుడా?  అడిగారు  గురువుగారు...

"ఓ...! వాల్మీకి కేవలసాక్షి అన్నమాట" అన్నాడు బాబు సమాధానం దొరికినట్టుగా...

"కాదు... రాముణ్ణి, రావణుణ్ణి, వాల్మీకిని గుర్తించే నీవే కేవలసాక్షివి" అని ఠక్కున చెప్పారు గురువుగారు.

* * *

ఒకణ్ణి జ్ఞాని అని గుర్తిస్తే దాని అర్థమేమి?

మిగతావారంతా అజ్ఞానులు అనే కదా!

నిజంగా మిగతావారు అజ్ఞానులే అయితే,

ఫలానావాడు జ్ఞాని అని ఎలా గుర్తించగలుగుతున్నారు?

కాబట్టి అజ్ఞానులు అనేవారు కూడా జ్ఞానులే.

ప్రకటనం అయిన జ్ఞాని - జ్ఞాని.

ప్రకటనం కాని జ్ఞాని - అజ్ఞాని.

అంతే.

వెఱసి ఇద్దరూ జ్ఞానులే.

అన్నారు గురువుగారు.

* * *

ఒకతను  నేనొక భజన కీర్తన పాడుతానన్నాడు...

"యెందుకు పాపం ఆయన్ను ఇబ్బంది పెట్టడం...?"

అన్నారు గురువుగారు.

అందరూ నవ్వారు.

"ఆయన్ను భజించకుండా ఉండడమే

ఆయన్ను భజించడం అవుతుంది."

అన్నారు గురువుగారు.

"భజన వలన దేవుడు దొరకడు.

అని తెలిసేవరకు భజన చేయవలసిందే."

అని గతంలో గురువుగారు చెప్పి ఉన్నారు.

భజన చేసే విధము తెలియండి జనులారా మీరు

నిజము కనుగొని మోదమందండి....

అని ఓ భజన పాట కూడా ఉంది.

నిజము కనుగొని మోదమందటమే నిజమైన భజన.

భజన వలన నిజము తెలియదు.

* * *

శరీరానికి బయట ఏం చేసినా అది పాపమే.

శరీరానికి లోపల ఏమి చేసినా అది పుణ్యమే.

నీ లోపల త్రాగి తందనాలాడినా,  వ్యభిచరించినా పుణ్యమే.

నీ వెలుపల చేసే యజ్ఞయాగాదులు కూడా పాపమే.

నీ వెలుపలున్నదంతా లౌకికమే...ఆధ్యాత్మికం అయినా సరే.

నీ లోపలున్నదంతా ఆధ్యాత్మికమే...లౌకికవిషయాలతో ఉన్నా సరే.

అని ప్రబోధించారు గురువుగారు.

* * *

శివుడుంటేనే శక్తికి(పార్వతికి) ఉనికి ఉంటుంది.

పార్వతి లేకపోయినా శివుడుంటాడు...

అన్నారు గురువుగారు.

పార్వతి లేకుండా ఎలా ఉంటుంది?

ప్రశ్నించాడు చెంగల్వరాయరెడ్డి...

"శివుడిలో కలిసిపోయి ఉంటుంది " అన్నారు గురువుగారు.

కవిలో కవితాశక్తి వలె

శివునిలో కల్పనాశక్తి ఉన్నది.

శివశక్తులు అభిన్నం.

* * *

ఈ జ్ఞానిసన్నిధిలో-

ఇలా తెలుగు మాటలన్నీ క్రొత్త క్రొత్త అర్థాలతో

(జ్ఞానప్రసూనాలుగా) గుభాళిస్తున్నాయి...

* * *

## 268. విశ్వం మొత్తం ఎంత తూకమో, పరమాణువు కూడా అంతే తూకము.

రూపాయి కావడానికి

వందపైసల్లో ప్రతి పైసా విలువైనదే.

ఒక్క పైసా తప్పుకున్నా అది రూపాయి అవదు.

"నిరుపయోగం అని తలచి ఒక్క అణువును పెరికివేసినా, ఈ విశ్వం కుప్పకూలిపోతుంది."

అంటారు గురువుగారు.

పరలోకపు తండ్రి పరిపూర్ణుడు. కనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు అన్న క్రీస్తుమాటలకు అర్థం ఇదే.

ఆకాశానికి బహువచనం ఉండదు.

పరిపూర్ణానికి బహువచనం ఉండదు.

'నేను అపరిపూర్ణుడను' అని అనుకుంటే,

పరిపూర్ణత్వానికే భంగం.

నీవు కలిస్తేనే పరిపూర్ణం.

ఆ రీత్యా విశ్వం తూకం, అణువు తూకం ఒకటే.

అంటే, రెండూ ఒకటే అని అర్థం.

విశ్వం నుంచి అణువును విడదీయలేం అని అర్థం.

"పరమాణువులో మహావిశ్వాలు ఇమిడివున్నాయి..."

అంటోంది వాశిష్ఠం.

విశ్వంలోనూ అణువులున్నాయి...

అణువులోనూ విశ్వాలున్నాయి...

ఇదంతా మనోవైచిత్ర్యం. అంతే.

"అణురచనా మనస్సెరిగినదే కావున

అణువు మనసే అగును..." అన్నారు భగవాన్.

మనసే విశ్వం....

మనసే అణువు...

అందుకే రెండూ ఒకే తూకం...

## 269. నీ దృష్టిని బట్టే సృష్టి

తులసీదాసు ప్రతిరోజూ సాయంత్రం  రామాయణప్రవచనం చేస్తుండేవారు...

హనుమంతులవారు ఓ వృద్ధమానవుని రూపంలో ఆ చివరి వరుసలో కూర్చొని వింటుండేవారు...

ఓరోజు తులసీదాసుగారు సుందరకాండ చెబుతూ...

"హనుమంతుడు లంకలో, ఓ తోటలో తెల్లనిపూలను చూచెను" అని చెప్పారు...

హనుమంతుడు ఉలిక్కిపడి, 'అరె నేను చూచింది ఎర్రని పూలు కదా!' అనుకుని, సర్లే సభ అంతా ఖాళీ అయిపోయాక, దాసుగారికి చెబుదాం...అని మిన్నకుండిపోయారు...

ప్రవచనం అయిపోయింది...

సభంతా ఖాళీ అయిపోయింది...

వృద్ధ మానవుని రూపంలో ఉన్న హనుమ,

తులసీ చెంతకు చేరి, "అయ్యా! దాసుగారూ! హనుమంతులవారు చూచింది తెల్లని పూలు కాదండీ...ఎఱ్ఱనిపూలు" అన్నాడు.

"కాదు హనుమంతులవారు చూచింది తెల్లనిపూలే" అన్నాడు స్థిరంగా.

"కాదు ఎఱ్ఱనివి" అన్నాడు ఆ వృద్ధుడు స్వరం పెంచి.

"కాదు తెల్లనివి" దాసుగారు పట్టు వదలలేదు...

ఇక లాభం లేదనుకుని హనుమంతులవారు తన నిజరూపంతో దర్శనమిచ్చి-

"నేనెవరుకున్నావు? నేను హనుమాన్... స్వయంగా ఆ తోటలో పూలను చూచినవాణ్ణి. నేను చూచింది ఎఱ్ఱనిపూలే" అన్నాడు.

"హనుమా! మీకు సహస్రాదిక వందనములు...

మీ దర్శనం రామదర్శనానికి శుభసూచకం...

మీరు చూచింది తెల్లని పూలే"

అన్నారు దాసు చిరునవ్వుతో...

వొళ్ళు మండింది హనుమాన్ కు...

హనుమ రాముణ్ణి ప్రార్థించాడు...

రాములవారు ప్రత్యక్షమయ్యారు...

ప్రత్యర్థులిద్దరూ రామునికి నమస్కరించుకున్నారు...

"హనుమా ఏంటి విషయం?" అడిగారు రాములవారు...

చూడు రామా! నేను లంకలో చూచింది ఎఱ్ఱని పూలైతే, ఈ దాసు తెల్లనిపూలు అంటున్నాడు...

అన్నాడు చిన్నపిల్లడిలా హనుమ.

రాములవారు చిరునవ్వుతో-

"అవును హనుమా! నీవు చూచింది తెల్లని పూలే."

అన్నారు.

"హే రామా! మీరు కూడా దాసు పక్షం అయిపోయారా?" అన్నారు విచారంగా.

"లేదు హనుమా! నీవు చూచింది తెల్లనిపూలే...

కానీ రావణునిపై ఆగ్రహంతో ఉన్న నీ కళ్లు ఎరుపెక్కి ఆ తెల్లనిపూలు ఎఱ్ఱగా కనబడ్డాయి...అంతే." అని తీర్పుతీర్చారు రాములవారు.

ఇద్దరూ సంతోషించారు...

హనుమ, దాసుగారిని ఆత్మీయంగా కౌగిలించుకున్నారు...

రాములువారు మాయమైనారు...

* * *

"నీ దృష్టిని బట్టే సృష్టి"

అనే ఆధ్యాత్మిక నానుడికి పరమ ఉదాహరణ ఈ కథ.

నీవు చూచే ప్రపంచం నీదే, నీవే...

అన్న సద్గురు సూక్తికి పరమ ఉదాహరణ ఈ కథ.

"సిద్ధా! లోకాలెన్నిరా?" అని అడిగిన బ్రహ్మంగారికి,

"ఎవడి లోకంలో వాడున్నాడు గురువుగారూ!" అని సిద్ధయ్య చెప్పిన సమాధానానికి పరమ ఉదాహరణ ఈ కథ.

* * *

బ్రహ్మ అనేవాడు ఒకడు ఉండి, ఒక లోకాన్ని సృష్టించడం, అందులో అందరం ఉండడం కాదు,

"నేనే" బ్రహ్మ.

"నేను" స్వయంగా సృష్టించుకున్న లోకంలో అందరూ ఉన్నారు, బాబు నుంచి బ్రహ్మతో సహా.

నేను కనే కలలో బాబుతో సహా సకలమూ ఉన్నట్లుగా.

బాబు కల నుండి మేలుకుంటే

సమస్తమూ పోయి, బాబే మిగులుతాడు.

కానీ "నేను" కనే ఈ జగత్కల నుండి మేలుకుంటే,

బాబుతో సహా సమస్తమూ పోయి

"నేను" మిగులుతాను.

ఆ "నేను" బాబు కాదు.

ఆ "నేనే" నేను.

అని బాబు తెలుసుకోవడమే ఆత్మవిచారఫలం.

అందువల్లనే మన గురువుగారు పదే పదే చెబుతుంటారు-

"నీవు దేనిని చూచినా, ఎవరిని చూచినా

నిన్ను నీవు చూస్తున్నట్టు అనిపించాలి." అని.

"నేను తప్ప ఏమీలేదు"

"నేను మాత్రమే ఉన్నాను"

"నేనే విశ్వకేంద్రం"

....ఇవన్నీ జ్ఞానమంత్రాలు....

* * *

ఈ తులసీ-హనుమ కథకు చారిత్రక ఆధారాలు అడిగితే, నా వద్ద లేదుగానీ,

నా చిన్నవయసులో ఓ అద్భుతమైన పుస్తకం చదివాను... ఆ పుస్తకం ఆద్యంతమూ మధురాతి మధురము...

ఆ పుస్తకం - "వినోభాభావే గీతాప్రవచనాలు"

ఈ కథ అందులోనిదే.

భారత స్వాతంత్ర్యపోరాటంలో కొంతకాలం చెరశాలలో ఉన్నప్పుడు తోటి ఖైదీలకు భగవద్గీతపై వినోభాభావే చేసిన ప్రసంగాల సమాహారమే ఆ పుస్తకం.

ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న ప్రతి ఒక్కరూ చదువదగిన పుస్తకం అది.

అందులో ప్రతిపేజీ నాకు ఇప్పటికీ గుర్తు.

అన్నిసార్లు చదివాను...

ఆధ్యాత్మికోన్నతిని కలిగించే ఇలాంటి మధురమైన కథలు ఎన్నో ఉన్నాయి అందులో...

గాంధీమహాత్ముడంతటివారు ఆధ్యాత్మికగురువుగా భావించిన మహావ్యక్తి - ఆచార్య వినోభాభావే.

* * *

## 270. జ్ఞాన జ్యోతి

మాయ అంటే లేనిది ఉన్నట్లుగా భ్రమింపజేయడం.

మైండ్ గేమ్

చీకట్లో త్రాడు తొక్కి పాము అని భ్రమపడి భయపడతాం. తీరా దీపపు కాంతిలో చూస్తే అది త్రాడు.

ఇప్పుడు మనల్ని భయపెట్టింది?

తాడా లేక పామా?

పాముని సృష్టించింది ఎవరు? అది త్రాడు లాగ భ్రమింప చేసింది ఎవరు .?

అది ఎందుకు భయపెట్టింది?

ఇందులో త్రాడు తప్పు లేదు. పాము తప్పు అంతకంటే లేదు.

పాముని సృష్టించింది మనస్సు.

భయపడింది మనస్సే. లేనిదానిని ఉన్నట్లుగా కల్పించుకుని భయపడింది. ఒక్కసారి కాంతి రాగానే పాము మరణించింది.

అంటే మాయమైంది.

త్రాడు మాత్రమే మిగిలింది. అంటే అక్కడ పాము సృష్టి జరగలేదు.

కానీ మనస్సు సంకల్పించి సృష్టించి భయమనే భావనకి లోనైంది.

సృష్టే జరగకుండా సృష్టి జరిగినట్లు కనబడటమే మాయ..

దీనినే అజ్ఞానం అంటారు. అజ్ఞానం తోలగాలి అంటే, జ్ఞానమనే దీపం వెలిగించాలి. అప్పుడు సృష్టి అబద్ధం అని తెలుస్తుంది.

ఇది తెలిస్తే నీకు అసలు జన్మే లేదు. నువ్వు జన్మించనూ లేదని అర్థమవుతుంది.

ఈ జ్ఞానం రానంతవరకు పునరపి జననం

పునరపి మరణం.. కష్టసుఖాలను ద్వంద్వాలను అనుభవించాల్సిందే .

జ్ఞాన దీపం వెలిగిన రోజు ద్వంద్వాలు కష్టసుఖాలు అనేవి వుండవు..

అంతా అద్వైతమే..

అహం బ్రహ్మాస్మి..

నేనే ఆది అంతం.

సాధనతోనే ఈ స్థితి అనుభవానికి వస్తుంది..

అంటే ఎప్పుడైతే మీరు నామరూపక్రియలను వదిలేసి ఆకాశంతో ఏకమౌతారో, అప్పుడు జ్ఞాన జ్యోతి వెలుగుతుంది.

ఆ జ్ఞాన జ్యోతి కోసమే మన సాధన.

## 271. ఏకం సత్

"పట్టపగటి వెలుగు పరమాత్ముడు

ఎట్ట ఎదుటనే ఉన్నాడు పరమాత్ముడు..."

అన్నాడు అన్నమయ్య.

మనం చూసేదంతా దేవుణ్ణే.

కానీ దేవుణ్ణి చూడాలని వ్యర్థప్రయత్నాలు చేస్తుంటాము.

"ఇందుగలడందు లేడని సందేహము వలదు..."

"హరిమయము గాని ద్రవ్యము పరమాణువు లేదు..."

అన్న అద్వైతవాక్యములను వల్లె వేస్తూనే ఉంటాము.

మరో ప్రక్క దేవుణ్ణి వెతుకుతూనే ఉంటాము.

నాకు దైవదర్శనం కాలేదని వాపోతూనే ఉంటాము.

* * *

సర్వత్రా ఉన్న దైవాన్ని మనకు దర్శింపజేయడానికి 'గురు' రూపంలో ఈ లోకంలోకి అప్పుడప్పుడు visit చేస్తుంటుంది మాయాశక్తి.

ఏ దివ్యసందేశాన్ని మనకు అందించడానికి గురువులు అవతరించారో ఆ సందేశాన్ని మనం తీసుకోగలిగితే చాలు...వారి అవతారప్రయోజనం పూర్తయినట్టే.

కాని మనం అది వదిలేసి, వారు ఏ ప్రాంత్రంలో పుట్టారు? ఏ తేదీన పుట్టారు? వారి తల్లిదండ్రులెవరు? వారు ఏ మతస్తులు? అన్న అనవసరమైన  శోధనలతో కాలాన్ని వ్యర్థం చేస్తుంటాము...

పోస్ట్ మేన్ ఎక్కడ ఎప్పుడు ఎవరికి  పుట్టాడో; అతని మతమేమో మనకు అనవసరం. పోస్ట్ మేన్ మనకు చేరవేసే 'లెటర్స్' ప్రధానం.

అలాగే షిరిడీబాబా, రమణమహర్షి, వివేకానంద, సద్గురు సుబ్రహ్మణ్యం  లాంటి మహనీయులు దైవసందేశాన్ని మనకు అందజేయడానికి వచ్చిన దైవదూతలు.

వారి సందేశాన్ని తీసుకొని, వాళ్లని వదిలేయడమే వాళ్లని నిజంగా గౌరవించినట్లు.

కానీ మనం చేస్తున్నదేమిటి?

వాళ్లకి పటాలు కట్టి, మఠాలు కట్టి సందేశాన్ని  పారవేసుకుంటున్నాము...

తత్త్వం తగ్గింది...

తతంగం పెరిగింది...

సంప్రదాయాలు ఇప్పుడు షోబిజినెస్ లు....

భక్తి ఇప్పుడు ఫ్యాషన్...

ఛారిటబుల్ ట్రస్ట్ లు ఇప్పుడు స్టేటస్ సింబల్స్...

* * *

మనం  ఉద్ధరింపబడడానికి ఉద్గ్రంథాలు అవసరం లేదు.

తతంగాలు అవసరం లేదు.

"భగవంతుడే యజమాని" అన్న షిర్డీబాబా సందేశం ఒక్కటి చాలు.

"నీవు నీవుగా ఉండు" అన్న రమణమహర్షి సందేశం ఒక్కటి చాలు.

"దేనికీ భయపడవద్దు" అన్న వివేకానందుల సందేశం ఒక్కటి చాలు.

* * *

డీప్ గా ఆలోచిస్తే దేవుని పేరుతో మనం చేసేదంతా దేవుని కోసం కాదేమో అనిపిస్తోంది...

దేవుని "ద్వారా" మరేదో పొందాలనేదే...

ఆ "మరేదో" అనేది వదిలేస్తే...

దేవుడు స్వచ్ఛంగా, పూర్ణంగా, ఉన్నపళంగా మనకు దొరికిపోతాడు.

'దేవుని కోసమే దేవుణ్ణి కొలువు' అంటారు గురువుగారు...

అలా దేవుని కోసమే దేవుణ్ణి కొలవడం...

అదే నిజమైన కర్మ, భక్తి, జ్ఞానం...

ఎవరు చెప్పారు అన్నది ముఖ్యం కాదు...

ఏం చెప్పారు అన్నదే ముఖ్యం.

అందరూ చెప్పింది ఒక్కటే -

"ఏకం సత్" అనేదే.

ఆ ఏకాత్మస్వరూపంలోనే సదా సంస్థితమై ఉండడం కన్నా జీవిత పరమార్థం మరొకటి లేనేలేదు.

* * *

## 272. అంతిమ మార్గం

నేను అని మనం నిత్యవ్యవహారంలో వాడే మాట

ఈ శరీరాన్ని దృష్టిలో ఉంచుకుని అనే మాటే.

నేను అంటే 'బాబు' అనే దానికి అర్థం.

ఇది సాకార అహంకారం.

నీ లోపలికి నీవు మునిగితే

అక్కడ శరీరస్పృహ ఉండదు.

కానీ 'నేను' అన్న స్ఫురణ ఉంటుంది.

ఇది నిరాకార అహంకారం.

ఈ నేను యొక్క మూలాన్ని వెతుక్కుంటూ...

అలానే వెనక్కు వెళితే,

మెలకువ రాగానే కల చెదరిపోయినట్టు

ఈ నేను కూడా లేకుండాపోయి "అసలు నేను"

సాక్షాత్కరిస్తుంది.

ఇది "అహం స్వరూపం"

ఇదే లోకానికి శ్రీరమణులు అనుగ్రహించిన

"జ్ఞానవిచారమార్గము".

మిగతా లోకంలో ఉన్న మార్గాలన్నీ సహాయకారులేగాని

అవి అంతిమం కాదు.

ఆత్మవిచారణ ఒక్కటే అంతిమ మార్గం.

ఎవరు ఏ మార్గాలలో ప్రయాణించినా

చివరికి "నేను" వద్దకు చేరవలసిందే.

"ఆత్మ"లో స్థిరపడవలసిందే.

* * *

"అసలు నేను" సాక్షాత్కారం జరిగాక కూడా

"వ్యక్తిగతమైన నేను" ఉంటుందిగాని

అది సూర్యోదయం అయ్యాక ఉన్న చంద్రుని వలె ఉంటుంది.

అనగా ఉండీ లేనట్లుంటుంది.

అసలు నేనును(ఆత్మను) సాక్షాత్కరించుకున్న మహనీయుని శరీరం కూడా పవిత్రవస్తువే, పూజనీయమే.

* * *

ఆత్మసిద్ధికై సాధన అవసరమా? కాదా?

అని గురువుగారిని అడిగితే,

ఆ ప్రశ్నలోనే సాధన అవసరం అనే సూచన ఉంది.

ఆత్మజ్ఞుడికి ఏ ప్రశ్నా ఉండదు.

ఏ సాధన చేయమంటారు? అని అడిగితే,

"నేను ఈ తనువుకు వెలుపల కూడా నిండి ఉన్నాను"

అని భావిస్తూ ఉండు.

కొంతకాలానికి ఆ భావ తీవ్రత వలన

"పూర్ణానుభవం" కలుగుతుంది అంటారు.

"అనుకుంటే సరిపోతుందా?" అని ఆశ్చర్యంగా అడిగితే,

"అవును. అనుకుంటే చాలు....

ఇప్పుడు 'నేను బాబు' అనే పరిమిత భావం కూడా

నీవు అనుకోవడం వలన ఉన్నదే తప్ప నీవు బాబు కాదు."

IAM THAT IAM నేను అదే నేను - నేను అదే నేను అని

పదే పదే అనుకోవడం వలన నిజంగానే నీవదే ఐపోతావు.

అందుకే మన ఋషులు "అహం బ్రహ్మాస్మి" అనుకోమన్నారు.

* * *

సాధన చేయుమురా నరుడా....

సాధ్యము కానిది లేదురా....

అన్నాడు దాశరథి.

అవును.... సాధన చేయవలసిందే.....

సాధన లేక సిద్ధి కలుగదు అని

రమణగీతలో రమణభగవానులు నొక్కి వక్కాణించి వున్నారు.

అవును....సాధన చేసి తీరవలసిందే.....

* * *

లౌకికవిషయంలో-

ధర్మాచరణయే గొప్ప సాధన.

ఆధ్యాత్మిక విషయంలో-

ఆత్మవిచారణే గొప్ప సాధన.

రెండిటి పరమగమ్యం స్వరూప దర్శనమే.

ధర్మాచరణ వలన మనస్సుద్ధి.

మనస్శుద్ధి వలన ఆత్మవిచారణ

సహాయకారులు.

నిజానికి ఆత్మవస్తువు మనలోని వస్తువే

మనమే అయి ఉన్న వస్తువే.

కాకపోతే విపరీతమైన బాహ్యావ్యవహారం వలన

ఆంతరమున ఉన్న ఆత్మ వస్తువు మరపుకు వచ్చి

ఉండి లేనట్లయ్యింది.

అంతేగాని సాధన అంటే లేని వస్తువును పొందటం కాదు,

ఉన్న వస్తువునే జ్ఞప్తికి తెచ్చుకోవడం... అంతే.

* * *

నేను ఎవడను? అని మనసు లోపల వెతుక్కుంటూ వెళ్లి హృదయస్థానానికి చేరుకున్నప్పుడు.....

ఈ వెతికే నేను తలక్రిందులుగ పడిపోతుంది.

(అనగా సముద్రపు లోతును కనుగొనడానికి ప్రయత్నించిన ఉప్పు బొమ్మవలె తన ఉనికిని కోల్పోతుంది)

వెంటనే నేను-నేను అంటూ మరో "నేను" తనకు తానుగా తోస్తుంది.

తోచినా అది అహంకారం కాదు,

అది పరిపూర్ణవస్తువు.

చిన్నపిల్లాడు తన వద్ద ఉన్న పావలా నాణెం

నాన్నకు ఇచ్చి రూపాయి నాణెం తీసుకున్నట్టు.

పావలాను పోగొట్టుకున్నట్టు అనిపిస్తుందేగాని,

అది పోలేదు.

రూపాయిగా(పూర్ణంగా) మారుకుంది.

అలాంటిదే ఆత్మవిచారణలో ఈ "పరిమిత నేను" పోగొట్టుకుని, "పరిపూర్ణమైన నేను" పొందడం కూడా.

కష్టంగా అనిపించే సుఖం - ఆత్మవిచారం.

నష్టంగా కనిపించే లాభం - ఆత్మసాక్షాత్కారం.

* * *

## 273. ఎయ్ తిత్తి....! స్వానుభవం

ఓ విద్యార్థి గురుకులాశ్రమంలో విద్యపూర్తిచేసుకుని ఇంటికెళ్లే సమయంలో అడిగాడు గురువుగారిని-

"గురువుగారూ! తమరి అనుగ్రహం వలన సకల శాస్త్రాలనూ అభ్యసించాను...కానీ "స్వానుభవం" అంటారే...! అది ఏమి? నాకిప్పటివఱకు ఆ స్వానుభవం అంటే ఏమిటో తెలియట్లేదు... దయచేసి నాకు స్వానుభవం కలిగించండి..." అని అభ్యర్థించాడు ఆ విద్యార్థి.

"ఓహో! నీకు స్వానుభవం కావాలి... అంతేగా...?

సరే, నేనొకతని చిరునామా ఇస్తాను... వారు నా గురువు. నేను విద్య మాత్రమే నేర్పగలనుగానీ, స్వానుభవం ఇచ్చే శక్తి మాత్రం నాకు లేదు... మా గురువు తప్పక నీవు కోరిన స్వానుభవం ఇవ్వగలరు...వెళ్లిరా" అని శిష్యుణ్ణి ఆశీర్వదించి సాగనంపారు...

ఆ శిష్యుడు విద్య పూర్తయ్యి, ఇంటికెళ్లి వివాహ చేసుకొని గృహస్థాశ్రమ జీవితం వైపుకు వేయవలసిన అడుగులు, విచిత్రంగా మరో గురువు వైపుకు అడుగులు పడుతున్నాయి...

రెండు మూడు రోజులు ప్రయాణం చేసి గురువు చెప్పిన గురువు వద్దకు చేరుకున్నాడు-

ఆ గురువుకు పెద్ద ఆశ్రమం, శిష్యబృందం, భోజనవసతి ఉంటాయని ఊహించాడు...అవేవీ లేవు సరికదా, అతను కంసాలివృత్తి చేసుకుంటున్న అతి సామాన్యుడు...

నా గురువుకు గురువు ఇతనా? అని ఆశ్చర్యపోయాడు...

"సర్లే, ఆయనెట్లా ఉంటే మనకెందుకు? మనకు స్వానుభవం కావాలి...అంతే." అని మనసులో అనుకుని అతనికి దగ్గరగా వెళ్లాడు.

ఆ సమయానికి కంసాల పనికి సహాయకుడుగా ఉండే కూలి ఆరోజు శెలవు పెట్టాడు... ఆ సహాయకుడు కొలిమి మండటానికి అవసరమైన గాలితిత్తి వేస్తేగాని, తన పని జరగదు. కూలీ కోసం యెదురుచూస్తున్నాడు...

ఆ సమయానికి ఈ శిష్యుడు వెళ్లి తనను తాను పరిచయం చేసుకోబోయాడు... అతను అవేవీ వినక- "ఎయ్ తిత్తి..." అన్నాడు.

సర్లే పని అయ్యాక, విషయం ఏంటని అడుగుతారు... తర్వాత చెబుతాం లే అని, ఆయన పనికి అవసరమైన గాలితిత్తి వేయడం మొదలు పెట్టాడు...

ఆ కంసాలి తన పని చేసుకోవడంలో నిమగ్నమైపోయాడు...

తాను "స్వానుభవం" గుఱించి అడిగినప్పుడల్లా-

"ఎయ్ తిత్తి..." అంటున్నాడేగాని, మరొక మాటే మాట్లాడ్డం లేదు...

ఇలా గంటలు, రోజులు, నెలలు సాగిపోయాయి...

ఓ ఏడాది కూడా పూర్తి కావొచ్చింది....

అప్పుడు అడిగినా సరే- "ఎయ్ తిత్తి...!" అంటున్నాడు...

అయినా మన గురువుగారు చెప్పారు- "అతడు నా గురువు" అని. నా గురువు కన్నా గొప్ప గురువు ఈ లోకంలోనే ఉండడు అని భావించాను...అటువంటి నా గురువుకే గురువైన ఈతడు ఇంకెత మహనీయుడై ఉండాలి! కాబట్టి ఏది ఏమైనా సరే, వీరి అనుగ్రహం దొరికేవఱకు తిత్తి వేస్తూనే వుంటాను... అని స్థిరనిశ్చయానికొచ్చాడు.

వెంటనే, ఆ కంసాలి- "రేయ్...నీకు స్వానుభవం వచ్చేసింది... ఆ తిత్తి వదిలేసి, ఇంటికెళ్లి సుఖపడు... అన్నారు...

ఇక ఏ ప్రశ్నలూ వేయకుండా,  తిత్తి వదిలి, ఇంటిముఖం పట్టాడు...

* * *

ఇంతకీ అతనికి "స్వానుభవం" వచ్చినట్లేనా?

స్వానుభవం పొందకుండా ఇక్కణ్నుంచి కదలనని భీష్మించుకున్నాడు కదా! తనకి స్వానుభవం కలిగిఉంటేనే కదా, తాను ఇంటిముఖం పట్టాడు...?

మరి ఏమిటా స్వానుభవం...?

"అన్నిటికీ సిద్ధపడి ఉండడమే" ఆ స్వానుభవం.

* * *

మన గురువుగారి జీవితంలో కూడా ఇలాంటి సంఘటనే ఒకటి జరిగింది...

దేవుని పటాల ముందు చాపపరచి తాతగారు, గురువుగారు కూర్చునేవారు...

తాతగారు బ్రహ్మంగారి పుస్తకం మధ్యలో అలా తెరచి శిష్యుడి చేతికిచ్చి చదవమనేవారు....

ఆ పేజీలు పూర్తయ్యాక, మళ్లీ పుస్తకం మూసి, మళ్లీ ఎక్కడో తెరిచి చదవమనేవారు...

మన గురువుగారికి విసుగు కలుగుతున్నప్పటికీ...

స్కూల్ కు వెళ్లడానికి ఆలస్యం అవుతున్నప్పటికీ...

తాతగారు ఆపమనేవరకు చదవడానికి సిద్ధపడగానే,

"ఇక చాలు ఆపు... పుస్తకం మూసేయ్!" అనేవారు తాతగారు.

* * *

అన్నిటికీ సిద్ధంగా ఉండాలి...

అంతేగానీ నీవు కోరిందల్లా సిద్ధించడం సిద్ధి కాదు.

అన్నిటికీ సిద్ధపడి ఉండడమే గొప్ప సిద్ధి.

సుఖమొచ్చినా ఆహ్వానించు...

దుఃఖమొచ్చినా ఆహ్వానించు...

రెండూ మనకు అతిథులే...

ఇదీ కాసేపే...అదీ కాసేపే...

ఉండి వెళ్లిపోయేవేగానీ, శాశ్వతంగా ఉండేవి కావు.

మబ్బులు వస్తుంటాయి, పోతుంటాయి...

ఆకాశం సదా ఉంటుంది.

సుఖం అనేదీ ఓ ఆలోచనే...

దుఃఖం అనేదీ ఓ ఆలోచనే...

వస్తుంటాయి...పోతుంటాయి...

ఈ రెంటినీ అంటక "నేను" సదా ఉంటాను.

* * *

వెంకయ్యస్వామిని ఒకరు మంత్రం అడిగితే-

"మంత్రమేముంది? తంత్రమేముంది? చూసుకుంటూ పోవడమే కదయ్యా...!" అన్నారు.

ఎందుకంటే, చూడబడేదంతా అశాశ్వతం.

చూచేవాడు శాశ్వతం.

"చూడబడేది అశాశ్వతం, సాక్షియైన ఆత్మయే శాశ్వతం... ఓ మనసా! నీ ప్రయాణాన్ని ముందుకు సాగడం ఆపి వెనక్కి అనగా ఆత్మవైపుకు మరలు" అని పలువిధాలుగా మన మనసుకు నచ్చజెప్పే ప్రక్రియే - వైరాగ్యం. వైరాగ్యం కలిగించడమే ఆధ్యాత్మికలక్ష్యం.

అంతటినీ అశాశ్వతమని త్రోసివేస్తూ వెళుతుంటే,

ఒక దశలో ఇక త్రోయడానికి ఏమీ కనిపించదు "తాను" తప్ప.

తనను(ఆత్మను)-

కదల్చలేం, మరల్చలేం, మార్చలేం.

అది చిదాకాశం.

ఆ శేషించిన "తాను" మాత్రమే శాశ్వతం...

అనే జ్ఞానం కలగడమే ఆత్మసాక్షాత్కారం...

ఆ వైరాగ్యం కలిగేవఱకు...

ఆ జ్ఞానం కలిగేవఱకు...

ఈ తిత్తి(శ్వాస) వేస్తూ ఉండవలసిందే.

* * *

"శ్వాస మీద ధ్యాస" యొక్క ప్రయోజనం ఏమంటే-

శ్వాస లేకపోయినా ధ్యాస(నేను) ఉంటాననే

జ్ఞానం కలగడమే.

అనగా- కర్మ, క్రియ లేని కర్తయే ఆ ధ్యాస.

శ్వాస - వాయులింగేశ్వరుడు.

ధ్యాస - జ్ఞానప్రసూనాంబిక.

శ్వాస- మనసు-మెలకువ ఈ మూడూ ఒకటే.

ధ్యాస-ఆత్మ-గాఢనిద్ర ఈ మూడూ ఒకటే.

పై మూడింటిలో క్రింద మూడూ ఉండవు.

క్రింది మూడింటిలో పై మూడూ ఉండవు.

* * *

జగద్దృష్టి తొలగి, తన్నుదా నెఱింగి యొకటి రెండును మాని 'నేను' లేని స్థితి సర్వసమ్మతము.

అన్నారు భగవాను ఉన్నది నలుబదిలో...

1991లో తొలిసారిగా "ఉన్నది నలుబది" చదివినప్పుడు, ఈ విషయంలో భలే సందేహం ఒకటి ఉండేది-

జగద్దృష్టి తొలగితే తన్ను తాను తెలుసుకోవడం జరుగుతుందా?

తన్ను తాను తెలుసుకున్నాక జగద్దృష్టి తొలగుతుందా?

చాలాకాలం నా మనసులోనే నలుగుతూ వుంది ఆ ప్రశ్న....

చాలాకాలం ఆ ప్రశ్నతోనే సహవాసం చేశాను...

అదో సరదా....

"ప్రశ్ననే ధ్యానిస్తూ ఉండండి...

ప్రశ్నే సమాధానంగా మారిపోతుంది..."

అంటుంటారు గురువుగారు.

అలాగే నా ప్రశ్న మరో ప్రశ్నగా నాలో వినబడ్డది...

అదే నాకు సమాధానమైంది.

చీకటి తొలిగాక సూర్యుడు ఉదయిస్తాడా?

సూర్యుడు ఉదయించాక చీకటి తొలగుతుందా?

తన్ను తాను తెలుసుకోవడం(జ్ఞానోదయం) వల్లనే

జగద్దృష్టి అనే చీకటి తొలగుతుంది.

తాను తెలుసుకునేది - విజ్ఞానం.

తనను తెలుసుకునేది - జ్ఞానం.

చదువుల సారం - చదివేవాడే.

ధ్యానఫలం - ధ్యానించేవాడే.

సమాధానం - ప్రశ్నించువాడే.

* * *